సాక్షి
హనుమకొండ

మంగళవారం | 3 | జనవరి | 2023



అ..ఆ.. అంతేనా!?

వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ జిల్లాలు వరంగల్, హనుమకొండగా మారినా.. అటవీ, ఆబ్కారీ శాఖలు విడిపోలేదు. పాత జిల్లాల పరిధిలోనే కొనసాగుతున్నాయి. - 8లో



ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు..

ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులు కాటారం మండల కేంద్రంలోని రోడ్డుపై నిరసన చేపట్టారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$30.0^0 / 19.0^0$

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. పొడి వాతావరణం ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బడి బయటి పిల్లల సర్వే నిర్వహించండి

జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్



విద్యారణ్యపురి: బడి బయటి పిల్లల సర్వే నిర్వహించాలని జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ కోరారు. ఎంఈఓలు, స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, సీఆర్పీలు, ఐఈఆర్పీలతో సోమవారం ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో బడి బయట ఉన్న పిల్లల సర్వే నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. జనవరి 6 నుంచి 18 వరకు విద్యా సంవత్సరానికి బడి బయట ఉన్న పిల్లల సర్వే నిర్వహించి రోజువారీ వివరాలు ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎంఐఎస్‌లకు సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ కో–ఆర్డినేటర్ రాధా, మండల విద్యాధికారులు రామ్‌కిషన్ రాజు, వెంకటేశ్వరరావు, రమాదేవి, రవీందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మనోజ్‌కుమార్, పట్టాభి సీఆర్పీలు, ఎంఐఎస్‌ఐఈఆర్పీలు, సీసీఓలు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఉద్యోగులు, అధికారులు కీలకం

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



హన్మకొండ అర్బన్ : జిల్లా అభివృద్ధికి ఉద్యోగులు, అధికారుల సమన్వయం ఎంతో కీలకమని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా గెజిటెడ్ అధికారుల సహకారంతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థంగా అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఓ జిల్లా అధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ వాసుచంద్ర, టీజీఓ జిల్లా అధికారుల విభాగం అధ్యక్షులు శ్రీనివాస్‌కుమార్, మేన శ్రీను, హరిప్రసాద్, తహసీల్దార్ రాజ్‌కుమార్, సురేశ్‌కుమార్, అన్వర్ హుస్సేన్, మాధవరెడ్డి, శేషు, ప్రభాకర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, రాజేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇం'ధన' వాడకంపై ఆరా

సాక్షి ఎఫెక్ట్

వరంగల్ అర్బన్: 'ఇంధన దోపిడీ' శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ ప్రావీణ్య స్పందించారు. గ్రేటర్ వరంగల్ వాహనాలకు డీజిల్ వాడకంపై ఆరా తీసి నివేదిక ఇవ్వాలని మేయర్ గుండు సుధారాణి సంబంధిత అధికారిని ఆదేశించారు. బల్దియా పరిధి ప్రజారోగ్యం, ఇంజనీరింగ్, ఉద్యానవన, అర్బన్ మలేరియాకు చెందిన వాహనాలు, ట్రిప్పులు, రోజుల వారీగా కూపన్ల జారీ, వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్ వివరాలపై ఓ డిప్యూటీ కమిషనర్‌కు మేయర్ పలు సూచనలు చేశారు. గోప్యంగా విచారణ జరిపి నివేదిక అందించాలన్నారు. కమిషనర్ ప్రావీణ్య ఇంధన దోపిడీపై ఎంహెచ్‌ఓ రాజేశ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'సులక్ష' సేవలను అభినందించిన ఆర్టీసీ ఎండీ



హన్మకొండ: సులక్ష సేవా సమితి సేవలను టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సి.సజ్జనార్ సోమవారం అభినందించారు. ఆ సమితి అధ్యక్షుడు మండువ సంతోశ్ సోమవారం హైదరాబాద్ బస్ భవన్‌లో సజ్జనార్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సులక్ష సేవా సమితి అందిస్తున్న సామాజిక సేవలను వివరించి, ఫొటోలను చూపించారు. వాటిని పరిశీలించిన వి.సి.సజ్జనార్ కార్యక్రమాలు బాగున్నాయని, ఇలాగే ముందుకు పోవాలని సూచిస్తూ సంతోశ్‌ను అభినందించారు.


వెయ్యి స్తంభాల గుడిలో పుష్పార్చన చేస్తున్న గంగు ఉపేంద్రశర్మ



మెట్టుగుట్టపై..



వరంగల్ వేంకటేశ్వర ఆలయంలో కొలువుదీరిన స్వామివారు, ఉత్తర ద్వార దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు





'ముక్కోటి'కి పోటెత్తిన భక్తజనం

వేంకటేశ్వర ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా వరంగల్ రామన్నపేట బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు ఉత్తర ద్వారం గుండా దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం సుప్రభాత సేవ ముగిసిన అనంతరం ఉత్తర ద్వారంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి కిలోమీటర్ మేర క్యూలో భక్తులు నిల్చున్నారు. అదేవిధంగా వెయ్యి స్తంభాల గుడి, మెట్టుగుట్టలో ప్రత్యేక పూజలు జరిపారు. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. - వరంగల్ చౌరస్తా/హన్మకొండ కల్చరల్/మడికొండ

ఇంక్రిమెంట్ల వివాదం..!

- జిల్లా విద్యాశాఖలో అన్ ఎయిడెడ్ సర్వీస్ కింద దరఖాస్తుల స్వీకరణ
- ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద చెల్లింపు
- కొందరు అనర్హులున్నారని ఆరోపణలు
- బిల్లుల నిలిపివేత
- అవసరమైతే కలెక్టర్‌కు నివేదిస్తాం : డీఈఓ అబ్దుల్‌హై



విద్యారణ్యపురి: జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద అన్‌ఎయిడ్ సర్వీస్ కలిగి ఉన్నవారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలనేది హైకోర్టు ఆదేశాలు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి డీఈఓకు ఆదేశాలు అందాయి. ఇంక్రిమెంట్లు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించగా.. అనర్హులు సైతం దరఖాస్తు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈప్రక్రియలో ఓ ఉపాధ్యాయుడు చక్రం తిప్పాడన్న ఆరోపణల మేరకు బిల్లులను నిలిపివేశారు. ఇంక్రిమెంట్లు ఇచ్చేందుకు జిల్లాలో గతంలో అన్ ఎయిడెడ్ సర్వీస్ కింద పని చేసి తరువాత ఎయిడెడ్ సర్వీస్‌లోకి వచ్చిన వారు దరఖాస్తులు, సర్వీస్ బుక్స్‌ను డీఈఓ కార్యాలయంలో సమర్పించారు. ఇలా సుమారు 50 మందికిపైగా ఉన్నారు. అందులో కొందరు ప్రస్తుతం పని చేస్తున్న వారు, రిటైర్డ్ అయినవారున్నారు. ఆయా ఉపాధ్యాయులు ఎన్నేళ్లపాటు అన్ ఎయిడ్ సర్వీస్‌ను కలిగి ఉన్నారనేది సర్వీస్ బుక్స్‌ను ఒక్కొక్కరివి పరిశీలించి అర్హత ఉన్న వారికి డీఈఓ ప్రొసీడింగ్స్ ఇవ్వాల్సింటుంది. ఆ తర్వాత ప్రొసీడింగ్స్‌తోపాటు బిల్లులు డీటీఓలో సమర్పిస్తే వారికి సర్వీస్‌ను బట్టి ఇంక్రిమెంట్ల కింద డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. సర్వీస్‌ను బట్టి ఇచ్చే ఇంక్రిమెంట్లతోపాటు వేతనాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నారు. హనుమకొండ ఇన్‌చార్జ్ డీఈఓగా వాసంతి ఉన్నప్పుడు ఈ ఇంక్రిమెంట్ల విషయంలో వారి సర్వీస్‌బుక్స్ (ఎస్‌బీ)ను పరిశీలించేందుకు ఓ కమిటీని నియమించారు. అందులో ఇద్దరు పీజీహెచ్‌ఎంలు, ఉర్దూ మీడియం స్కూల్ ఉపాధ్యాయుడు ఉన్నారు. ఆ కమిటీ పరిశీలన చేసి డీఈఓకు సమర్పించింది.

అనర్హులకు కూడా అవకాశమంటూ ఆరోపణలు?

జిల్లాలో రెండు దశాబ్దాలు, అంతకుముందు కూడా ఎయిడెడ్ పాఠశాలల్లో నియామకం అయినవారిలో కొందరు కొంతకాలంపాటు అన్ ఎయిడ్ సర్వీస్ చేశాక ఎయిడెడ్ గ్రాంటులో నియామకమైన వారు ఉన్నారు. అన్ ఎయిడెడ్ సర్వీస్ కలిగినవారికి అప్పట్లో డీఈఓ కూడా ర్యాటిఫికేషన్ నియామకం ఉత్తర్వులు ఉండాల్సి ఉంటుంది. నియమ నిబంధనల ప్రకారం అన్ ఎయిడ్ సర్వీస్ ఉన్నవారికి ఇంక్రిమెంట్లు ఇస్తున్నారని తెలియడంతో కొందరు తమ సర్వీస్ బుక్స్‌లలో అన్ ఎయిడ్ సర్వీస్‌ను కూడా చేసినట్లు మార్పులు చేశారనేది ఆరోపణలు వస్తున్నాయి. అందుకు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చక్రం తిప్పుతూ చేతివాటం ప్రదర్శించారని సమాచారం. డీఈఓ కార్యాలయంలో ఎయిడెడ్ ఉపాధ్యాయుల బిల్లులు చేయడంలోనూ అతడికి అనుభవం ఉంది. దీంతో ఆయన చేతివాటం ప్రదర్శించి కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసి రిటైర్డ్ అయిన ఓ ఉపాధ్యాయుడు డిగ్రీతోనే 1985లోనే నియామకం అయి కొన్నేళ్లు అన్ ఎయిడెడ్ సర్వీస్ చేశారు. ఆ తర్వాత టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి ఎయిడెడ్ సర్వీస్ చేసి ఉద్యోగ విరమణ పొందారు. అతను కూడా అన్ ఎయిడ్ ఇంక్రిమెంట్ కోసం దరఖాస్తు చేస్తే సర్వీస్‌బుక్‌ను పరిశీలించి డిగ్రీతోనే అన్ ఎయిడ్ సర్వీస్ చేశావు కాబట్టి ఆ కాలానికి ఇంక్రిమెంట్లు రావని చెప్పారు. దీంతో ఆ రిటైర్డ్ ఉపాధ్యాయుడు విషయాన్ని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై దృష్టికి తీసుకెళ్లారు. అనర్హులకు కూడా ఇచ్చేందుకు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చక్రం తిప్పుతున్నారని కూడా మౌఖికంగా చెప్పుకొచ్చాడు. దీంతో కొద్దిరోజుల క్రితమే ఆ ఉపాధ్యాయుడిని డీఈఓ కార్యాలయంలో విధులు నిర్వర్తించవద్దని చెప్పి పాఠశాల విధులకు పంపినట్లు సమాచారం.

గతంలో ఇంక్రిమెంట్లు పొందాక రికవరీ

ఉమ్మడి రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలో అన్ ఎయిడ్ సర్వీస్ చేసిన వారికి 2003లో సర్వీస్ ఇంక్రిమెంట్లు ఇచ్చారు. 2005లో అప్పటి ప్రభుత్వం వాటిని రద్దు చేసి ఆ ఇంక్రిమెంట్లు పొందిన ఉపాధ్యాయుల నుంచి రికవరీ చేసింది. ఆతర్వాత పరిణామ క్రమంలో వ్యక్తిగతంగా ఎంతో మంది అన్ ఎయిడెడ్ సర్వీస్ ఇంక్రిమెంట్ల కోసం కోర్టులను ఆశ్రయించారు. ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కొంత కాలం క్రితమే కోర్టు తీర్పునిచ్చింది. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అమలు చేయలేదు. దీంతో ఉపాధ్యాయులు కోర్టు ధిక్కరణ కేసులు వేశారు. దీంతో చివరికి ఇటీవల దీన్ని అమలు చేసేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపక్రమించారు. హనుమకొండ జిల్లాలో ఇచ్చేందుకు ఉపక్రమించగా పలు ఆరోపణలతో ఆ బిల్లులను నిలిపివేశారు.

లోకల్ ఫండ్‌కు పంపిస్తాం : డీఈఓ అబ్దుల్‌హై

ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద అన్ ఎయిడెడ్ సర్వీస్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలనేది హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అమలు చేస్తాం. అన్ ఎయిడెడ్ సర్వీస్‌కు డీఈఓ ర్యాటిఫికేషన్ నియామకం ఆర్డర్ ఉండాలనేది ఇప్పుడు పలువురు చెబుతున్నారు. ఆయా ఉపాధ్యాయుల బిల్లుల ఎస్‌బీలు లోకల్ ఫండ్ ఆడిట్ అధికారులకు పంపిస్తాం. వారు పరిశీలించిన తర్వాతే ఇంక్రిమెంట్లు మంజూరు చేస్తాం. అవసరమైతే కలెక్టర్‌కు నివేదించాక వారి ఆదేశాల ప్రకారం అమలు చేస్తాం.

డ్రమ్ సీడర్‌తో విత్తుకుంటే అధిక లాభాలు

- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు
- డ్రమ్ సీడర్‌తో విత్తే పద్ధతి ప్రదర్శన



ఒంటిమామిడిపల్లిలో క్షేత్ర ప్రదర్శనలో కేవీకే శాస్త్రవేత్తలు

ఐనవోలు: డ్రమ్ సీడర్‌తో వరి విత్తుకుంటే అధిక లాభాలు ఉంటాయని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు రాజు, సాయికిరణ్, గణేశ్ అన్నారు. సోమవారం మండలంలోని ఒంటిమామిడిపల్లిలో కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాజన్న ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం డ్రమ్ సీడర్‌తో విత్తే పద్ధతిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రమ్ సీడర్‌తో విత్తుకోవడం వల్ల రైతులకు ప్రధాన పొలంలో వరి నాటేయడానికి అయ్యే ఖర్చు సుమారుగా రూ.5 వేలు తగ్గుందన్నారు. అదేవిధంగా 13 నుంచి 28 శాతం దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఈ పద్ధతిలో విత్తడం వల్ల కలుపు సమస్య తగ్గుతుందని వివరించారు. ఇద్దరు వ్యక్తులతో రోజుకు రెండెకరాలు నాటు వేసుకోవచ్చని తెలిపారు. నీటి అవసరం తక్కువగా ఉంటుందని, విత్తనాలు సమదూరంలో విత్తుకోవడం వల్ల మొక్కలకు గాలి అందుతుందని తద్వారా దిగుబడులు పెరిగే అవకాశం ఉందని వివరించారు. సాధారణ పద్ధతిలో కంటే 10 రోజులు ముందుగా కోతకు వస్తుందన్నారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రారంభం



జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హనుమకొండ ప్రధాన న్యాయమూర్తి కృష్ణమూర్తి

వరంగల్ లీగల్: రాష్ట్ర వ్యాప్తంగా నూతన కోర్టులు ఏర్పాటు చేసిన జిల్లాలకు ప్రత్యేక న్యాయ సేవాధికార సంస్థలను ఆయా కోర్టుల ప్రాంగణంలో సోమవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈమేరకు హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో పాటు ములుగు, జేఎస్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థలను ఆయా కోర్టుల్లో ప్రారంభించారు. హనుమకొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థను హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జస్టిస్ పి.నవీన్‌రావు, వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి, జిల్లా న్యాయమూర్తులు జయలక్ష్మి, పద్మజ, సి.పావని, సత్యేంద్ర, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు బి.శ్రీనివాసులు, ఎం.వెంకటేశ్వరరావు, సీహెచ్.ఎ.ఎస్ మూర్తి, వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు, అదనపు కలెక్టర్లు, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఈ.ఆనంద్‌మోహన్, జి.శ్రీనివాస్‌గౌడ్, గవర్నమెంట్ ప్రాసిక్యూటర్ టి.శ్యామ్‌సుందర్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరేళ్ల తర్వాత మైనార్టీలకు రుణయోగం

ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

యువతలో అవగాహన పెంచడమే ధ్యేయం

- వివరాలు 10లో

సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి

ఆత్మకూరు: హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా పరకాల నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌ని కోరినట్లు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించి నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బీజేపీ పథకాలకు బీఆర్‌ఎస్ రంగు




పెద్దమ్మగడ్డలో పర్యటిస్తున్న రావు పద్మ

హన్మకొండ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కేసీఆర్ సర్కారు బీఆర్‌ఎస్ రంగు వేస్తూ ప్రజలను పక్కదోవ పట్టిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. 'ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం హనుమకొండ 4వ డివిజన్ పరిధి పెద్దమ్మగడ్డలో పర్యటించారు. ఈసందర్భంగా ప్రజలకు బీజేపీ పథకాలు, నిధుల వివరాలను కరపత్రాలు పంచుతూ వివరించారు. వరంగల్ నగర అభివృద్ధికి బీజేపీ సర్కారు వందల కోట్ల రూపాయలు మంజూరు చేస్తుంటే కేసీఆర్ సర్కారు వాటిని పక్కదోవ పట్టిస్తోందని విమర్శించారు. మాజీ మంత్రి విజయరామారావు, సదానందం, ప్రకాశ్, భరత్, మధుసూదన్, రంజిత్, అశోక్, శివ, శ్యామ్, రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

వరంగల్ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ



శిక్షణలో మాట్లాడుతున్న వెంకటరమణ

ఎంజీఎం: సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. సోమవారం పోచమ్మమైదాన్ కెమిస్ట్రీ భవన్, కొత్తవాడ ఇన్నర్ వీల్ క్లబ్‌లో ఆరోగ్య కార్యకర్తలకు/ఆశా కార్యకర్తలకు సమగ్ర ప్రాథమిక ఆరోగ్య(పీహెచ్‌సీ) శిక్షణ శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణలో ఆరోగ్య సిబ్బంది నేర్చుకున్న మెలకువలు ప్రజలకు సేవలందించేందుకు ఉపయోగపడుతాయన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సీపీహెచ్‌సీల ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాలరావు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఇన్‌చార్జ్ డీపీహెచ్‌ఎన్‌ఓ జ్ఞానసుందరి, శిక్షణ టీఓటీలు మేరీ, స్వరూప, మనుజ, వరమ్మ, రజనీ, శిక్షణ కో–ఆర్డినేటర్ ప్రకాశ్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్.. పెండింగ్!

బల్దియాలో పరిష్కారం నోచని ఫైళ్లు.. పైసలిస్తేనే పనులు

- ఉన్నతాధికారులకు ఫిర్యాదులు.. అయినా దక్కని ఫలితం
- గ్రేటర్ ప్రజావాణిలోనూ పోటెత్తుతున్న దరఖాస్తులు
- అత్యధికంగా ఇళ్ల నిర్మాణాలు.. ఇంటి నంబర్లపైనే వివాదం

సాక్షిప్రతినిధి, వరంగల్:

- పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న ఒకరు హనుమకొండలో ఇంటి నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల సాకుతో నెల రోజుల కాలయాపన తర్వాత అనుమతి ఇచ్చారు. ఇంటి నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర దాటినా కొత్త ఇంటినంబర్ జారీకి తిప్పుకుంటున్నారు.
- వరంగల్ రామన్నపేట ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి టీఎస్–బీపాస్ ద్వారా భవన పర్మిషన్‌కు దరఖాస్తు చేశారు. నెల రోజులు గడిచినా అనుమతి ఇవ్వలేదు. తిరిగి తిరిగి వేసారిన సదరు వ్యాపారి రూ.15వేలు ఇచ్చిన మరుసటి రోజే భవన నిర్మాణానికి ఓకే చెప్పారు.

.. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫైళ్లు క్లియర్ కావాలంటే ఆషామాషీ కాదు. ప్రతి పనికి ఓ రేటు కాగా.. పైసలిస్తేనే ఆ ఫైళ్లు కదులుతాయన్న అపవాదు మూటకట్టుకుంటున్నారు. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా.. పెద్దగా స్పందన లేదని బాధితులు చెబుతున్నారు. గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయమే కాదు.. కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లోనూ పౌరసేవ (సిటిజన్ చార్టర్)ల అమలులో జాప్యం చేస్తున్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పలువురికి మొట్టికాయలు వేసినా.. పౌరసేవలపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినా ఆ నిబంధనలు తూచ్ అంటున్నారు. దీంతో దరఖాస్తుదారులు అయితే డబ్బులు చెల్లించాలి.. లేదంటే నెలల తరబడి తిరగాల్సిన పరిస్థితి. నిబంధనలు మాట్లాడితే సాకులు పెట్టి దరఖాస్తులు తిరస్కరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పట్టని పుర'ప్రజావాణి'...

భవనాల నిర్మాణం, ఇంటినంబర్లు, నల్లా కనెక్షన్లు, జనన మరణ ధ్రువీకరణ.. ఇలా తమ అవసరాలను బట్టి దరఖాస్తు చేసుకుంటున్నారు. సిటిజన్ చార్టర్ ప్రకారం గడువు కోసం వేచిచూసి ఫలితం లేకపోవడంతో 'ప్రజావాణి'ని ఆశ్రయిస్తున్నారు. గతేడాది మొత్తం ప్రజావాణిలో 10,659 దరఖాస్తులు రాగా, 5,947 పరిష్కరించిన అధికారులు 307 తిరస్కరించి 3,920 పెండింగ్‌లో పెట్టారు. ఇందులో టౌన్‌ప్లానింగ్, పబ్లిక్‌హెల్త్, వాటర్ సప్లయీస్, జనన మరణవిభాగం, ఆసరా పింఛన్లు, పాత రికార్డులకు చెందినవి అత్యధికంగా ఉన్నాయి. కొత్త ఇంటి నంబర్లు, ఆస్తిపేరు మార్పిడి, ఆస్తి విభజన ఫైళ్లు ముందుకు కదలాలంటే ఇంటి నంబర్‌కు రూ.20 వేలకుపైగా డిమాండ్ చేస్తున్నట్లుగా ప్రచారం. ఆస్తిపేరు మార్పిడి, బైఫర్‌కేషన్‌కు రూ.5 వేలకుపైగా తీసుకుంటున్నారు. కొందరు ఆర్‌ఐలు ప్రభుత్వ, లేఅవుట్ ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు ఇచ్చి రూ.లక్షల్లో దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో బిల్డింగ్ పర్మిషన్‌కు ఆశాఖకు చెందిన కొందరు రూ.20 వేలు వసూలు చేస్తున్నట్లుగా తెలిసింది. కొత్త నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు రూ.2 వేలు, ట్రేడ్‌లైసెన్స్‌లకు సంబంధించి ఇంటర్నెట్‌లో వెంటనే క్లియర్ చేసేందుకు రూ.3వేలు.. ఇలా ప్రతి పనికి ధర నిర్ణయించి వసూలు చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సిటిజన్ చార్టర్ ఏం చెబుతుందంటే..

- ప్రజలకు సత్వర సేవలను అందించేందుకు ప్రభుత్వం సిటిజన్ చార్టర్‌ను రూపొందించింది. ఈ మేరకు భవన నిర్మాణానికి 21 రోజుల్లో అనుమతులు ఇవ్వాలి.
- కొత్త లేఅవుట్‌కు 30, కొత్త నల్లా కనెక్షన్ 15, ట్రేడ్ లైసెన్సుల జారీకి 7, కొత్త ఇంటినంబర్‌కు 15, ఆస్తి విభజనకు 30, పుట్టినతేదీ ధ్రువీకరణకు ఐదు, మరణ ధ్రువీకరణకు 7, సహజ మరణం, ఇతరాలకు 30, పాత రికార్డుల పత్రాల జారీ 7 రోజుల్లో జరగాలి.
- ఆస్తిపేరు మార్పిడి ఇతరాలైతే 30 రోజులు గడువు పెట్టారు.
- ఒకవేళ ఆస్తి పేరు మార్పిడి సేల్ డీడ్ అయితే వెంటనే చేయాలి.
- సీడీఎంఏ జారీ చేసిన సిటిజన్ చార్టర్ గడువులోపు అర్జీలు పరిష్కరించక పోతే సంబంధిత అధికారి, ఉద్యోగులపై జరిమానా విధించాలి.
- నెలకు రెండు సార్లు ఉన్నతాధికారులు సిటిజన్ చార్టర్‌పై సమీక్ష జరపాలి.
- కానీ వరంగల్ బల్దియాలో ఇవేమీ పట్టకపోవడంతో కిందిస్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.



వీలైనంత తొందరగా పరిష్కరిస్తున్నాం..

బల్దియా ద్వారా ప్రజల సమస్యలు వీలైనంత తొందరలో పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడుతున్నాం. ఈ విషయంలో అధికారులు, ఉద్యోగులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఎవరైనా డబ్బులు తీసుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- మేయర్ గుండు సుధారాణి

నర్సింగ్‌లో విదేశీ ఉద్యోగ శిక్షణ, నియామకాలు

హన్మకొండ అర్బన్/కాళోజీ సెంటర్: జపాన్‌లో పని చేసేందుకు అర్హులైన నర్సింగ్ సిబ్బందికి శిక్షణతోపాటు నియామకాలు చేపట్టనున్నట్లు హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉపాధి కల్పన అధికారులు మల్లయ్య, ఎస్.మాధవి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 4 నుంచి వరంగల్ కేఎంసీలోని నర్సింగ్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నమోదిత కళాశాలలు, సంస్థల నుంచి బీఎస్సీ నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్ఎం డిప్లొమా హోల్డర్లు ఈప్రోగ్రామ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 22 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు ఈనెల 4న ఉదయం 10 గంటల్లోపు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపికైన వారికి జపనీస్ భాష, ఆదేశంలో నర్సింగ్ డ్యూటీకి సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తైన అభ్యర్థులకు నెలకు రూ.1.20 నుంచి రూ.1.50 లక్షల వేతనం ఉంటుందని తెలపారు. అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి టామ్ కామ్ హెచ్ఆర్ మేనేజర్లు 9100798204, 9908830438 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు టామ్ కామ్.తెలంగాణ.జీవోవీ.ఇన్ సందర్శించాలని లేదా టామ్ కామ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని వారు సూచించారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

గీసుకొండ : మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన సాయిలి హారిక కనిపించడం లేదని ఆమె తండ్రి సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన హారిక తిరిగి రాలేదని పేర్కొన్నాడు. నర్సంపేట బిట్స్ కాలేజీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోందని, విశ్వనాధపురం గ్రామానికి చెందిన దూల జ్యోతిబోస్ అనే డ్రైవర్‌తో వెళ్లినట్టు అనుమానంగా ఉందని ఫిర్యాదులో వివరించాడు. తన కూతురు ఆచూకీ గుర్తించి న్యాయం చేయాలని కోరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు తెలిపారు.

అ..ఆ.. అంతేనా?

రూరల్, అర్బన్ జిల్లాగానే 'అటవీ, ఆబ్కారీ' శాఖలు

- వరంగల్, హనుమకొండ జిల్లాలు ఏర్పడి ఏడాది దాటినా.. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినప్పటికీ వర్తించని విభజన
- గందరగోళం నడుమ విధులు నిర్వర్తిస్తున్న ఆయా శాఖల అధికారులు
- తమ శాఖలను కొత్త జిల్లాలుగా మార్చాలని వేడుకోలు



హనుమకొండ సుబేదారిలోని అటవీ శాఖ వరంగల్ సర్కిల్ కార్యాలయం కాంప్లెక్స్

సాక్షి, వరంగల్: వరంగల్ రూరల్.. వరంగల్ జిల్లాగా, వరంగల్ అర్బన్.. హనుమకొండ జిల్లాగా అధికారికంగా ఏర్పడి దాదాపు ఏడాదికి పైగా కావస్తోంది. అయినా ఆ రెండు శాఖలకు మాత్రం విభజన వర్తించని పరిస్థితి నెలకొంది. 2021, ఆగస్టు 13న వరంగల్ రూరల్ జిల్లాలోని పరకాల, నడికూడ, శాయంపేట, ఆత్మకూరు, దామెర మండలాలను హనుమకొండ జిల్లాలో కలిపారు. వరంగల్ అర్బన్‌లోని వరంగల్, ఖిలా వరంగల్ మండలాలను వరంగల్ జిల్లాలో కలిపారు. ఆ తర్వాత ఆయా ప్రభుత్వ విభాగాలు కూడా తమ హద్దుల మేరకు మారి సేవలందిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. అటవీ(అ) శాఖ, ఆబ్కారీ(ఆ) విభాగం విభాగాలకు మాత్రం ఇప్పటికీ కొత్త జిల్లాలు వర్తించలేదు. ఫలితంగా ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి తాము ఏ జిల్లానో పక్కాగా చెప్పుకునే పరిస్థితి లేదు. ముఖ్యంగా ఎక్కువ ఆదాయం సమకూర్చే వరంగల్, ఖిలా వరంగల్ మండలాలను హనుమకొండ(పాత వరంగల్ అర్బన్) అధికారులు వదులుకునేందుకు ఇష్టపడట్లేదనే టాక్ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఇక్కడి నుంచి అనుమతి కోసం ప్రతిపాదనలు వెళ్లినా ఇప్పటికీ క్లియర్ కాలేదని తెలిసింది. దీనిని అనుసరించాల్సిన ఉమ్మడి వరంగల్ కేంద్రమైన హనుమకొండ ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు అనుమతి వచ్చినా ఇంకా అమలు చేయడం లేదనే ప్రచారం ఉంది. కొత్త సంవత్సరంలోనైనా కొత్త జిల్లా ప్రకారం తమ విభాగ సేవలు అందించేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

తీసుకున్నారు.. ఇవ్వట్లేదు..!

వరంగల్, ఖిలావరంగల్‌లో సామిల్లు వ్యాపారం జోరుగా సాగుతోంది. వందలాది ట్రిప్పుల కలప ఇక్కడకు నిత్యం వస్తుంది. రెండంకెల సంఖ్యలో ఉన్న ఈ సామిల్లుల్లో ట్రిసిటీవాసులతోపాటు చుట్టుపక్కల మండలాల ప్రజలకు అవసరమైన బెడ్లు, కుర్చీలు, డైనింగ్ సెట్, సోఫాలు.. ఇలా ఇంట్లో, కార్యాలయాలకు అవసరమైన వాటిని తయారు చేస్తుంటారు. అలాగే సెకండ్ హ్యాండ్ బిజినెస్ కూడా ఎక్కువగానే సాగుతోంది. పాత ఇళ్లు ఇప్పిన సమయాల్లో పోగుచేసే తలుపులు, కిటికీలు, చెక్కలను తక్కువ రేటుకు కొనుగోలు చేసి వాటితో కుర్చీలు, బెడ్‌లు, డైనింగ్ సెట్‌లు.. ఇలా అన్నీ తయారు చేస్తుంటారు. వీటి లెక్కలు తేల్చే అటవీ శాఖ అధికారులను అప్పుడప్పుడు 'మామూలు'గా చూసుకుంటుండడంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా వ్యాపారం సాగుతోంది. అందుకే ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఈ రెండు మండలాలను వదిలిపెట్టేందుకు హనుమకొండ అధికారులు ఆసక్తి చూపడం లేదనే ఆరోపణలున్నాయి.

వరంగల్ నుంచి ఐదు మండలాలకు సంబంధించిన రికార్డులు తీసుకున్న హనుమకొండ అధికారులు మాత్రం వరంగల్, ఖిలావరంగల్ రికార్డులు మాత్రం ఇప్పటివరకు అప్పగించకపోవడం గమనార్హం.

కసరత్తు చేయాల్సి వస్తోంది..

ఇక ఎక్సైజ్ విభాగం పరిస్థితి కూడా దాదాపు అంతే ఉంది. వరంగల్, ఖిలా వరంగల్‌లో వైన్స్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు ఎక్కువగా ఉన్నాయి. గతంలో వరంగల్ అర్బన్(ప్రస్తుతం హనుమకొండ) జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు ఆ రెండు మండలాలు వచ్చినా ఇప్పటికీ హనుమకొండ ఎక్సైజ్ విభాగం ఆధీనంలోనే ఉండడం గమనార్హం. వరంగల్ జిల్లా ఏర్పడి దాదాపు ఏడాదికి పైగా కావొస్తున్నా ఇప్పటికీ ఈ విభాగం వరంగల్ ఎక్సైజ్ పరిధిలోకి రాలేదు. వారు ఆ రెండు మండలాలను వీరికి ఇప్పటికీ అందించలేదు. ప్రస్తుతం హనుమకొండ జిల్లా పరిధికి వెళ్లిన పరకాల, నడికూడ, శాయంపేట, ఆత్మకూరు, దామెర మండలాల్లో పది వరకు వైన్స్‌లు ఉండడంతో ఈ రికార్డులను తీసుకునేందుకు హనుమకొండ ఎక్సైజ్ అధికారులు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఏదేమైనా ఆదాయం వచ్చే ప్రాంతాలను వదులుకునేందుకు సిద్ధంగా లేకపోవడంతో పెద్ద కసరత్తు చేయాల్సిన అవసరం కనిపిస్తోంది. ప్రభుత్వం జిల్లాలుగా విభజించినా ఈ విభాగాల విభజన జరగకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా చీఫ్ సెక్రటరీ స్థాయిలోనే ఈ విభజన ప్రక్రియ ఉందంటూ ఈ రెండు విభాగాల అధికారులు చేతులు దులుపుకోవడం గమనార్హం. అన్ని ప్రభుత్వ విభాగాలకు వర్తించిన విభజన ఇక్కడ ఎందుకు వర్తించదంటే సమాధానం ఇచ్చేవారు కరువయ్యారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు...

- రోడ్డెక్కిన గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు

కాటారం : ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ తీవ్ర చలిలోనూ గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులు మండల కేంద్రంలోని రోడ్డుపై సోమవారం నిరసన చేపట్టారు. 'ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు.. వెంటనే బదిలీ చేయండి'.. అని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పలు పార్టీలకు చెందిన నాయకులు మద్దతు తెలపడంతో సుమారు గంటపాటు అలజడి నెలకొంది. ప్రిన్సిపాల్ చైతన్య తమకు స్వేచ్ఛ నివ్వడం లేదని, తమ తల్లిదండ్రులను అగౌరవపర్చుతూ గంటల తరబడి గేటు వద్దనే నిలబెడుతోందని విద్యార్థినులు వాపోయారు. అస్వస్థతకు గురైతే చికిత్స కోసం కాలినడకన తీసుకెళ్తున్నారని, పాఠశాలలోనే బంధించినంత బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌ను బదిలీ చేసే వరకు దల బోమని భీష్మించారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎస్సై శ్రీనివాస్ అక్కడకు చేరుకుని విద్యార్థినులకు సర్దిచెప్పారు. ప్రిన్సిపాల్ చైతన్యతో ఎస్సై ఫోన్‌లో సమస్యలపై మాట్లాడారు. సమస్యను ఎంపీపీ సమ్మయ్య ఫోన్‌లో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేపట్టి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలపడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు.

ఆర్సీఓ విచారణ..

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకులాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి సోమవారం విచారణ చేపట్టారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి పాఠశాలలో విద్యార్థులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థినులు సమస్యలను ఆర్సీఓకు వివరించారు. విచారణ వివరాల నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్సీఓ తెలిపారు. బాలల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థినులకు కౌన్సిలింగ్ చేశారు. సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సమితి సభ్యులు విద్యార్థినులకు సూచించారు.

బాలల హక్కులను కాపాడాలి

కాజీపేట : అన్ని ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సమష్టిగా పనిచేసి బాలల హక్కులను కాపాడాలని సీసీఆర్‌బీ ఏసీపీ ప్రతాప్‌కుమార్ సూచించారు. సీపీ రంగనాథ్ ఆదేశం మేరకు పోలీస్ కమిషనరేట్‌లో చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్ ప్రొటెక్షన్, రెవెన్యూ, విద్య, లేబర్, పరిశ్రమలు, ఎన్‌జీఓ విభాగాల అధికారులతో సోమవారం రాత్రి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. తప్పిపోయిన, వదిలేయబడిన, భిక్షటన చేస్తున్న వారినే కాకుండా బాల కార్మికులను గుర్తించాలని కోరారు. సమావేశంలో జనగామ, వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన అధికారులు సుజాత, అనిల్‌చందర్, వసుధ, ఉప్పలయ్య, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వినతులు సత్వరమే పరిష్కరించండి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు తీసుకుంటున్న వరంగల్ కలెక్టర్ గోపి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో స్వీకరించిన వినతులను అధికారులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ హన్మంతు మాట్లాడుతూ.. కాలయాపన లేకుండా వినతులు తక్షణమే స్పందించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 108 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, డీఎండబ్ల్యూఓ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ సబిత, డీసీఎస్‌ఓ వసంతలక్ష్మి, డీఎల్‌పీఓ కల్పన, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అర్జీ'పై నిర్లక్ష్యం వద్దు : వరంగల్ కలెక్టర్ గోపి

కరీమాబాద్: ప్రజలు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చి అర్జీలు సమర్పిస్తారని, వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దని వరంగల్ కలెక్టర్ డాక్టర్ గోపి అన్నారు. గ్రీవెన్స్‌లో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 61 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీవత్స, ఆర్డీఓ మహేందర్ జీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఖిలా వరంగల్ మండల పరిధిలోని 43వ డివిజన్ బెస్తం చెరువు సర్వే నంబర్ 241లోని భూమి కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని, ఆ ప్రదేశంలోని ప్రభుత్వ భూమిలో స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన నిరుపేదలం గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నామని, 60 గజాల చొప్పున స్థలం కేటాయించి పట్టాలు ఇవ్వాలని గుడిసెలవాసులు విన్నవించారు.

వాహనదారుడిపై చీటింగ్ కేసు నమోదు

కాజీపేట : ద్విచక్ర వాహనానికి రిజిస్ట్రేషన్ చేయించకుండా ఏడాదిన్నరగా తిరుగుతున్న వ్యక్తిపై హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు సోమవారం రాత్రి చీటింగ్ కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి.రవికుమార్ కథనం ప్రకారం.. సీపీ రంగనాథ్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. కాగా సోదా వికాస్ టీఆర్ నంబర్ ప్లేట్‌తో తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నగరంలో నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనదారుడిపై కేసు నమోదు చేయడం తొలిసారి అని చెప్పారు.

ఇద్దరి అరెస్ట్

కాజీపేట : సెలూన్ షాపు ఓనర్‌పై దాడి చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హనుమకొండ నయింనగర్‌లో డిసెంబర్ 30న ఇద్దరు వ్యక్తులు సెలూన్ షాప్‌కు వచ్చి హేయిర్ కటింగ్ చేయాలని కోరారు. వీలు కాదని షాపు యజమాని రంజిత్ చెప్పడంతో అతడిపై దాడి చేసి గాయపర్చారు. నిందితులను సీసీ కెమెరాల ఆధారంగా ఖాదర్ పాషా, బక్కే అఖిల్‌గా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తిలోని ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ గ్రామ శివారులో అదుపు తప్పి పంట పొలాల్లో బోల్తాపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ప్రమాదాన్ని గుర్తించి డ్రైవర్ పక్కకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసులు విచారణ చేపట్టి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పల్లె కన్నీరు పెట్టింది..

- 'కురవి' మృతుడు నవీన్ అంత్యక్రియలు

చిన్నగూడూరు : మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్ర శివారులో చోటు చేసుకున్న భారీ ప్రమాదంలో మృతి చెందిన డొంకన నవీన్ అంత్యక్రియల్లో గ్రామం శోకసంద్రంలో మునిగింది. మండలంలోని మంగోరిగూడెంలో నవీన్ అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. శనివారం రాత్రి ప్రమాదం చోటు చేసుకుని నవీన్ మృతి చెందిన విషయం తెలిసిందే. అదే ప్రమాదంలో మృతి చెందిన సుమన్, శ్రీకాంత్‌ల అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. నవీన్ తల్లి బతుకుదెరువు కోసం సూరత్‌కు వెళ్లి అక్కడే ఉంటుండగా ఆమె రాక కోసం నవీన్ మృతదేహాన్ని సోమవారం వరకు అంత్యక్రియలు నిర్వహించకుండా ఉంచారు. ఈ క్రమంలో గ్రామానికి చేరుకున్న నవీన్ తల్లి, భార్య కన్నీరుమున్నీరుగా విలపించారు. చేతికందిన కొడుకు చనిపోయాడంటూ నవీన్ తల్లి గుండెలు అవిసేలా విలపించడం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. మూడేళ్ల వయస్సున్న చిన్న పిల్లలను ఎలా సాకాలంటూ నవీన్ సతీమణి కన్నీరు మున్నీరైంది. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడవెల్లి రాజవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రామచంద్రరావు మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మరిపెడ సీఐ సాగర్, ఎస్సైలు రవికుమార్, పవన్‌కుమార్, నరేశ్ బందోబస్తు నిర్వహించారు.



నవీన్ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు





స్కూటీతో సహా లారీ కింద ఇరుక్కుని మృతి చెందిన సంపత్‌రావు



ఘటనా స్థలిలో రోదిస్తున్న బంధువులు





ప్రమాదంలో గాయపడ్డ మహిళలు

కమలాపూర్ : హన్మకొండ జిల్లాలోని కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని టేకుమట్ల మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన బిక్కినేని సంపత్‌రావు (53) భార్య విజయతో కలిసి కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో బంధువుల ఇంట్లో జరిగిన దశదినకర్మకు స్కూటీపై వచ్చి తిరిగి వెళ్తుండగా ఉప్పల్‌లోని భీంపల్లి, కన్నూరు క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో హుజూరాబాద్ వైపు నుంచి కమలాపూర్ దిశగా వెళ్తున్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల లారీ ఢీకొట్టింది. లారీ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఎమ్మార్పీఎస్ జెండా గద్దెతోపాటు స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సంపత్‌రావు అక్కడికక్కడే మృతి చెందగా ఆయన భార్య విజయ, అక్కడే బస్సు కోసం వేచి ఉన్న కన్నూరుకు చెందిన సుమలత తీవ్ర గాయాల పాలయ్యారు. అలాగే అక్కడే తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటున్న అంజలికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ మహిళలిద్దరినీ 108 వాహనం ద్వారా ఆస్పత్రికి తరలించారు. సంపత్‌రావు మృతి చెందిన విషయం తెలిసి అతడి బంధువులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. కన్నూరు క్రాస్ రోడ్డు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై పడుకుని, బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఉప్పల్-కమలాపూర్ మార్గంలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. మృతుడి కూతురు శైలజ స్పృహ కోల్పోగా ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కమలాపూర్, హసన్‌పర్తి, ఎల్కతుర్తి సీఐలు సంజీవ్, నరేందర్, శ్రీనివాస్, ఎస్సైలు సతీశ్, పరమేశ్, విజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పగా సుమారు 5 గంటల అనంతరం ఆందోళన విరమించారు.

'గెల్లు' పరామర్శ

మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఆయన ఉప్పల్‌కు చేరుకున్నారు. మృతుడి కుటుంబాన్ని, బంధువులను పరామర్శించారు. వైద్యులకు ఫోన్ చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

రైలులో ప్రయాణికుడి మృతి

- సుమారు 1.20 గంటలపాటు నిలిచిన వైనం
- యాత్రికులకు ఇబ్బందులు



భగీరథ విశ్వాస్ మృతదేహం



మృతుడి భార్య సునిత విశ్వాస్



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

డోర్నకల్ : కన్యాకుమారి నుంచి కోర్బా వెళ్తున్న ప్రత్యేక రైలులో అనారోగ్యంతో ఓ ప్రయాణికుడు సోమవారం మృతి చెందాడు. సుమారు 1.20 గంటలపాటు రైలును డోర్నకల్‌లోనే నిలిపేశారు. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. డిసెంబర్ 24న దక్షిణ భారత యాత్ర కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కోర్బా స్టేషన్ నుంచి ఐఆర్‌టీసీ ప్రత్యేక యాత్రా రైలు బయల్దేరింది. తిరుపతి, కన్యాకుమారి తదితర పుణ్యక్షేత్రాల సందర్శన అనంతరం రైలు కోర్బాకు వెళ్తుండగా ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో విజయవాడ సమీపంలో రైలులో ఎస్-3 బోగీలో ప్రయాణిస్తున్న కోర్బాకు చెందిన భగీరథ విశ్వాస్ (79) తీవ్ర అస్వస్థతకు గురై టాయిలెట్‌లో పడిపోయాడు. భర్త పడిపోవడాన్ని గమనించిన భార్య సునిత విశ్వాస్ ఇతర ప్రయాణికుల సహాయంతో బెర్త్‌పైకి చేర్చింది. రైలు డోర్నకల్ రైల్వేస్టేషన్‌కు సోమవారం ఉదయం 8.10 గంటలకు చేరుకున్న తర్వాత 108 సిబ్బంది భగీరథ విశ్వాస్‌ను పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ప్రసాద్‌తోపాటు జీఆర్పీ, ఆర్పీఎఫ్, కమర్షియల్ సిబ్బంది బోగీ వద్దకు చేరుకుని పరిస్థితిని ఉన్నతాధికారులు వివరించారు. అధికారుల ఆదేశాల మేరకు భగీరథ విశ్వాస్ మృతదేహాన్ని రైలింజన్ వెనుక ఉన్న బ్రేక్ బోగీలోని చేర్చారు. కాగా స్ట్రెచర్ లేకపోవడంతో పోలీసులు చివర నుంచి మూడో బోగీలో ఉన్న మృతదేహాన్ని ఇంజన్ వెనుక ఉన్న బ్రేక్ బోగీలోకి చేర్చేందుకు సుమారు ముప్పావు కిలోమీటర్ దూరం మోసుకుంటూ తీసుకెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు 1.20 గంటలపాటు రైలు డోర్నకల్‌లో నిలిచిపోవడంతో యాత్రకు బయల్దేరిన ప్రయాణికులు ఇబ్బంది పడడం కనిపించింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..



మృతి చెందిన చందర్

కమలాపూర్ : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని పూరిగుట్ట తండాకు చెందిన మాలోతు చందర్ (50) కమలాపూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు గత నెల 27న చందర్ ఇంట్లోంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. మృతుడికి ఫిట్స్ ఉందని, అతిగా మద్యం సేవించి తాగునీరు దొరక్క మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతునికి భార్య, ఐదుగురు కూతుర్లున్నారు. చందర్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కూలీల జాతర..

మిర్చి తోటల్లో పని కోసం మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మూటాముల్లెలతో కూలీలు డోర్నకల్‌లో రైలు దిగుతుండడం జాతరను తలపించింది.

- డోర్నకల్

